"మీరు కూడా రావడం నాకు సంతోషకరమైన విషయం. కాని ముందు రానన్నారెందుకు?" సందేహంగా అడిగింది ఆవిడ.

"మీరు నన్నో, విజయాన్నో ఆహ్వానించి ఉంటే మిగిలిన ఇద్దరం భోజనానికి నీ ఇంటికి వచ్చే వాళ్ళం కాదు. ప్రేమ ఎక్కడకి వెళితే మిగిలిన ఇద్దరం అక్కడికి వెళతాం." చెప్పాడు ఐశ్వర్యాధి దేవత.

"ఎక్కడ ప్రేమ ఉంటే అక్కడ ఐశ్వర్యం, విజయం ఉంటాయి." చెప్పాడు విజయాధి దేవత.

## 65. మనసు శుభ్రం

పేకాట, మద్యం, సిగరెట్, మగువ లాంటి భౌతికమైన అలవాట్లతో పాటు, అసూయ, గర్వం, ఇతరులని ఎద్దేవా చేయడం లాంటి మానసిక దురలవాట్లు కూడా ఉన్న సుకుమార్‌కి అనుకోకుండా రైలులో ఓ సన్యాసి తారసపడ్డాడు. ఆయన మొహంలోని ప్రశాంతతని, వర్చస్సుని చూసిన సుకుమార్‌కి తన మొహం కూడా అలా మారితే ఎంత బావుంటుంది అనిపించింది. అతనితో మాటలు కలిపాడు. సుకుమార్ ఏదీ దాచకుండా తనకున్న అన్ని అలవాట్లనీ ఆ సన్యాసికి చెప్పాడు.

"ఇవన్నీ చెడ్డవని నాకు తెలుసు. వీటిని వదిలించుకోవాలన్న కోరిక కూడా నాలో ఉంది. కాని అందుకు నాకు సాధ్యం కావడం లేదు."

"అవును. చెడ్డ అలవాట్లున్న ప్రతీ మనిషికీ వాటిని వదిలించుకోవాలన్న కోరిక కూడా అంతర్లీనంగా బలంగానో, బలహీనంగానో ఉంటుంది. ముందుగా ఒక్క అలవాటుని వదిలించుకుంటే చాలు. మిగిలినవన్నీ చకచక వాటంతట అవే వదులుతాయి." చెప్పాడు సన్యాసి.

"అదెలా సాధ్యం? ఎంతో ప్రయత్నం మీద ఒక్క అలవాటుని వదిలించుకోగలమేమో కాని, అన్నిటినీ వదిలించుకోగలగడం కష్టమని నేననుకుంటున్నాను."

అందుకు సన్న్యాసి చిన్నగా నవ్వి చెప్పాడు.

"ఓ గది అశుభ్రంగా ఉందనుకో. అప్పుడు నువ్వు దాన్ని సర్దాలనుకుంటావు. ఆ ప్రయత్నం చేస్తే ఏమౌతుంది? ముందు బూజు దులుపుతావు. తర్వాత కింద నేలని శుభ్రంగా ఊడుస్తావు. అప్పుడు కార్పెట్‌లు మురికిగా ఉన్నాయనిపిస్తుంది. వాటిని శుభ్రం చేసి, ఆనక కిటికీ కర్టెన్స్ మాసిపోయాయన్న సంగతిని గమనిస్తావు. వాటినీ మారుస్తావు. ఇంత నీట్‌గా ఉన్న గదిలో కిటికీ కమ్మీలకు అంటిన మురికి స్పష్టంగా నీకు కనిపిస్తుంది. దాంతో దాన్ని శుభ్రం చేయకుండా ఉండలేవు. ఇలా గదిని శుభ్రం చేసేకొద్దీ అపరిశుభ్రంగా ఉన్న ఒకొక్కటే మన కంట పడుతూంటాయి.

"అన్నింటినీ ఎలా శుభ్రం చేస్తూ పోతామో, అలాగే ఓ చెడ్డ అలవాటుని మనం వదిలించుకుంటే, మిగిలిన వాటిమీద కూడా మనం ఆధిక్యతను సంపాదించి, వాటినీ వదిలించుకోవడం తేలికవుతుంది. కాబట్టి ప్రయత్నిస్తే ఎవరైనా సరే ఎంతటి చెడ్డ అలవాట్లనించయినా బయట పడగలరు. అందుకు అవి పేరుకున్న మనసుని శుభ్రం చేయడం మొదటగా ఆరంభించాలి. ప్రయత్నిస్తే నీకదేం అసాధ్యం అయిన విషయం కాదని త్వరలో గ్రహిస్తావు." ప్రోత్సహిస్తూ చెప్పాడు ఆ సన్న్యాసి.

త్వరలోనే సుకుమార్ ఆ సన్న్యాసి మాటల్లో నిజం ఉందని గ్రహించాడు. కొద్ది నెలల తర్వాత అతనిలోని చెడ్డ అలవాట్లన్నీ మటుమాయం అయ్యాయి.

## 66. వెన్నంటే కర్మలు

పూర్వం కృష్ణదాసు, లక్ష్మీపతి అనే ఇద్దరు మిత్రులున్నారు. కృష్ణదాసుకి భక్తి ఎక్కువ. లక్ష్మీపతి జల్సా పురుషుడు. ఓ సారి పక్క గ్రామానికి ఎవరో మహాత్ముడు వచ్చాడని విని, ఆయన్ని చూడటానికి వెళ్తూ కృష్ణదాసు తన